క్లుప్తంగా

ఘనంగా గ్రీన్ హోమ్ డెవలపర్స్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న రిటైర్డ్ డిఫెన్స్ అధికారి భాస్కర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: న్యూ బాలాజీ కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్‌లో ఆదివారం ఆ సంస్థ 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో రిటైర్డ్ డిఫెన్స్ అధికారి భాస్కర్‌రెడ్డి, ఇరిగేషన్ వర్క్ ఇన్స్పెక్టర్ మధసూదన్, రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ అధికారి జ్యోతి, రిటైర్డ్ సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ నన్నయాచార్యులు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బ్రహ్మానందం ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాప డైరెక్టర్ రమేష్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థలో రూ.6 లక్షల నుంచి రూ.20 లక్షలకు ప్లాట్ ఇస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి వారు నెల నెలా వాయిదాల పద్ధతిలో సొమ్ము చెల్లించే సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 7075966533లో సంప్రదించాలని తెలిపారు. సంస్థ సీనియర్ సేల్స్ మేనేజర్లు లీలాప్రసాద్, వివేక్, హెచ్‌ఆర్ జీఎం రాము, రూప పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు సీఐటీయూ, రైతు, వ్యవసాయ సంఘాల నేతలు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయా సంఘాల నేతల జిల్లా సదస్సు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ మాట్లాడారు. దేశంలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు పెట్టడం దారుణమన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామన్న మాట విస్మరించి మోసం చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి జిల్లాలోని కార్మికులు చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, జిల్లా కోశాధికారి కేఎస్ఎస్.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు పుల్లయ్య, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు రమణయ్య, గురవమ్మ పాల్గొన్నారు.

జమున వ్యక్తిత్వం అందరికీ ఆదర్శం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత పి.హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: సమాజ చైతన్యానికి సినిమా అత్యుత్తమమైన సాధనమని, ఉత్తమ నటిగా రాణించిన జమున వ్యక్తిత్వం సినిమా రంగానికి ఆదర్శం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సీపీఐ కార్యాలయంలో సినీ నటి జమున చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జమున ప్రజానాట్య మండలి వ్యవస్థాపకులలో ఒకరైన గరికపాటి రాజారావు సహకారంతో సినిమా రంగానికి వచ్చారని తెలిపారు. అనేక ఒడిదుడుకులు వచ్చినా తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకోకుండా మొక్కవోని ధైర్యంతో అందరికీ ఆదర్శవంతంగా ఉండేలా జీవితాన్ని కొనసాగించారని తెలిపారు. ఆమె మృతి సినిమా రంగానికి తీరని లోటని తెలిపారు. ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య, ఉపాధ్యక్షుడు గుర్రప్ప, జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నేత వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

పెరుగుతున్న గంగమ్మ ఆలయ ప్రాశస్త్యం

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- అమ్మవారికి 108 దక్షిణావృత శంఖాల వితరణ
- ఆలయ నిర్మాణానికి వెల్లువెత్తుతున్న విరాళాలు



ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష



దాతలను అమ్మవారి వస్త్రాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, చైర్మన్ గోపీయాదవ్, మేయర్ శిరీష

తిరుపతి కల్చరల్: సుమారు వెయ్యేళ్ల చరిత్ర కలిగి సాక్షాత్తు తిరుమల వెంకన్న చెల్లెలుగా భక్త కోటి నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రాశస్త్యం రోజురోజుకూ పెరుగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా జానపద సంస్కృతి, విశేష వేషధారణలతో వారం రోజులు జాతర నిర్వహించడం ఘన చరిత్రకు తార్కాణం. 400 ఏళ్ల క్రితం వరకు తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు తొలుత తిరుపతి గంగమ్మను దర్శించుకునేవారు. తర్వాత తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లేవారు. కాలక్రమేణా ఆ ఆచారం మరుగున పడింది. ప్రాచీన ఆచారాలు, వ్యవహారాలను పునర్ ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సంకల్పించారు. ఇందులో భాగంగా భక్తులను భాగస్వాములను చేస్తూ అత్యంత వైభవంగా జాతరను నిర్వహించారు. అలాగే శ్రీవారి భక్తులు ముందుగా అమ్మవారిని దర్శించుకుని తర్వాత తిరుమల వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అమ్మవారి ఆలయానికి ఆహ్వానించారు. ఆలయ చరిత్రను ముఖ్యమంత్రికి తెలియజేసి ప్రాచీన వైభవాన్ని తిరిగి తీసుకువచ్చేలా అద్భుత రీతిలో ఆలయ పునర్ నిర్మించేలా చొరవ తీసుకున్నారు. ఫలితంగా టీటీడీ, దేవదాయ, టూరిజం శాఖల సమన్వయంతో సుమారు రూ.12 కోట్లతో గంగమ్మ పనులకు శ్రీకారం చుట్టారు. అమ్మవారి వైభవాన్ని గుర్తించిన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు ఇస్తున్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌కు చెందిన యామ వీరేష్, జయ దంపతులు దక్షిణాఫ్రికా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అత్యంత ప్రాశస్త్యం కలిగిన 108 దక్షిణావృత శంఖాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం గంగమ్మ ఆలయానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, అర్చకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ప్రాశస్త్యాన్ని విస్తరించేందుకు స్థానికులు, భక్తులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. అమ్మవారి కుంభాభిషేకం నిమిత్తం దాతలు ప్రతిష్టాత్మకమైన 108 శంఖాలు బహూకరించడం అభినందనీయమన్నారు. అలాగే దాతలు యామ వీరేష్, జయ దంపతులు అమ్మవారి ఆలయ గర్భగుడి అలంకరణకు అవసరమైన 3 వేల చిన్న శంఖాలతో పాటు లక్ష రుద్రాక్షలను అందించనున్నారని పేర్కొన్నారు. రాబోవు అమ్మవారి గంగజాతరలోపు గర్భాలయ పునర్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడికి చెక్



జేశాప్ జిల్లా నూతన కమిటీ సభ్యులు

తిరుపతి తుడా: జర్నలిస్టులు ఒత్తిడిని అధిగమించాలంటే క్రీడలు ఎంతో అవసరమని ఏసీఏ చిత్తూరు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు క్రికెట్ విజయ కుమార్ తెలిపారు. కపిలతీర్థం రోడ్డులోని కేబీఆర్ సమావేశ మందిరంలో ఆదివారం జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జేశాప్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జేశాప్ వ్యవస్థాపకుడు, దివంగత సోడిశెట్టి దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడిగా పులిగోరు శ్రీనివాసులు, కార్యదర్శిగా నెల్లూరు శ్రీనివాసులు, కోశాధికారిగా మంగళం సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులుగా దుగ్గాని ప్రసాద్, ఎన్.ప్రసాద్, ఘట్టమనేని శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా నల్లబోతుల ప్రసాద్, భూమిరెడ్డి నరేష్‌రెడ్డి, అర్థమాల కామేష్, షేక్ రిహాన్, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప్, తులసీరామ్, మునికృష్ణారెడ్డి, అమర్నాథ్, చల్లా విజయ్ కుమార్, మునిశేఖర్, లోకేష్, భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో నిమగ్నమయ్యే జర్నలిస్టులు తమ వ్యక్తిగత ఆరోగ్యంపైనా దృష్టి సారించాలన్నారు. ప్రముఖ సాహితీ కళారంగ వ్యవస్థాపకుడు కొత్తపల్లి మునిరత్నం మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పరితపించే జర్నలిస్టులు సంఘంగా ఏర్పడి క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి పి.బాలచంద్ర మాట్లాడుతూ తిరుపతి జిల్లా జర్నలిస్టులు రాష్ట్ర స్థాయి క్రికెట్‌లో రాణిస్తూ పతకాలు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. ప్రెస్‌క్లబ్ ద్వారా సంపూర్ణ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు రామకష్ణ రాజు, వెంకటరెడ్డి, రాష్ట్ర సలహాదారు శ్రీనాథ్ రెడ్డి, కార్యదర్శి శివశంకరయ్య, ఉప కార్యదర్శి మోడియం ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి



చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో డ్రైవర్లు బస్సులను నిలపడం లేదని ఫిర్యాదులు వస్తున్నా యని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు సహకరించాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేసినా కొందరు పెడచెవిన పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీపై గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుసుకోవాలని హితవుపలికారు. తీరుమార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రయాణికులు కూడా టికెట్‌కు సరిపడా చిల్లర తెచ్చుకోవాలని కోరారు.

కార్మికుల కడుపు కొడుతున్న కేంద్రం



మాట్లాడుతున్న జి.ఓబులేశు

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ కార్మికుల కడుపు కొడుతోందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు ఆరోపించారు. ఏపీ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు ఆదివారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్మికులు బైరాగిపట్టెడ నుంచి కృష్ణాపురం ఠాణా వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడ బహిరంగ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది పనిచేస్తున్న అసంఘటిత రంగానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 1.78 కోట్ల మంది కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి మాట్లాడుతూ రూ.లక్షల కోట్లు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయే వారికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌రెడ్డి, రాధాక్రిష్ణ, రాజా, ఎన్‌డీ.రవి, యూనియన్ రాష్ట్ర నేతలు అంజిబాబు, రమణ, సాంబశివరావు, చంద్రశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పౌరులు ప్రశ్నించడాన్ని అలవర్చుకోవాలి



ఎంపికైన కమిటీ సభ్యులతో గుత్తి త్యాగరాజు

ఎర్రావారిపాళెం: పౌరులు ప్రశ్నించడాన్ని అలవర్చుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రటరి గుత్తి త్యాగరాజు తెలిపారు. బోడేవాండ్లపల్లి వద్ద ఆదివారం కౌన్సిల్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతిని అంతమొందించడమే కౌన్సిల్ లక్ష్యమన్నారు. సమాచార హక్కు చట్టంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల అవినీతి వెలికి తీసి మార్పునకు నాంది పలకాల్సిన అవశ్యకత యువతరంపై ఉందన్నారు. అనంతరం మండల స్థాయి కమిటీని ఏర్పాటుచేశారు. కన్వీనర్‌గా చిన్నపరెడ్డి, కార్యదర్శిగా సాయికుమార్‌ను ఎన్నుకుని నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్య వంతులను చేయడం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు.

కోలాహలంగా

ఎడ్ల పందేలు



పశువులను నిలువరిస్తున్న యువకులు

రామచంద్రాపురం మండలంలోని పీవీ పురంలో ఆదివారం ఎడ్ల పందేలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులు తమ పశువుల కొమ్ములకు రంగులు వేసి చెక్కలతో తయారుచేసిన పలకలను కట్టి అలంకరించారు. కొంతమంది తమకు నచ్చిన నాయకులు, క్రీడాకారుల చిత్రాలను, వివిధ దేవుళ్లను బొమ్మలను పలకలకు అతికించారు. అనంతరం దొడ్ల నుంచి పశువులను వదిలారు. యువకులు పరుగులు తీస్తున్న పశువులను నిలువరించి వాటికి కట్టిన బహుమతులను సొంతం చేసుకునేందుకు పోటీ పడ్డారు. అనంతరం గ్రామస్తులు అన్నదానం చేశారు.

- రామచంద్రాపురం



రంకెలేస్తున్న కోడెగిత్తలు



నాయకుల ఫొటోలతో ఉన్న ఎద్దులు

నరసింగాపురం రైల్వే బ్రిడ్జి వద్ద కలెక్టర్ పరిశీలన



శ్రీవారిమెట్టు రోడ్డులోని చెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఆర్డీఓ కనక నరసారెడ్డి

చంద్రగిరి: మండలంలోని నరసింగాపురం వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జిని ఆదివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. ఇటీవల రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా ఎన్‌హెచ్ అధికారులు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించారు. ఈ క్రమంలో పచ్చని చెట్లను తొలగించారంటూ ఓ వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశాడు. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఆదివారం కలెక్టర్ ఆర్డీఓ కనకనరసారెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్ రెడ్డి, రెవెన్యూ అధికారులతో కలిసి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, శ్రీవారిమెట్టు మార్గాల్లో తొలగించిన చెట్లను పరిశీలించారు. ఈ మేరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు నివేదిక అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, డీటీ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం



రోడ్ల పనులను పరిశీలిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కీలకమన్నారు. ఈ క్రమంలోనే 3,000 ఎకరాల విస్తీర్ణంలోని మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కనెక్టివిటీ పెరగడం వల్ల నగరం తూర్పు ప్రాంతంలో విస్తరిస్తుందన్నారు. ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. ఏకకాలంలో 14 మాస్టర్ ప్లాన్ రోడ్లను చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. నాడు ముందస్తు ప్రణాళికలతోనే తిరుమల బైపాస్ రోడ్, ఏఐఆర్ బైపాస్ రోడ్డు, మహిళా యూనివర్సిటీ రోడ్డు, అలిపిరి రోడ్డు వచ్చాయన్నారు. ఇవే నగరంలో ప్రధాన రహదారులుగా నిలిచాయన్నారు. తాము అభివృద్ధి చేసిన అన్నమయ్య మార్గ్, వైఎస్ఆర్ మార్గ్ ప్రధాన రహదారులుగా మారతాయని పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించి స్వచ్ఛందంగా తమ భూములను ఇవ్వడం అభినందనీయమన్నారు.

గాంధీ కలలను సాకారం చేస్తున్న సీఎం జగన్



మాట్లాడుతున్న బి.వినోద్ రాథోడ్

తిరుపతి కల్చరల్ : గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని భారత్ యువజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్ రాథోడ్ తెలిపారు. ఆయన ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పింఛన్ల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడేవారని తెలిపారు. నేడు ఆ పరిస్థితి లేదని వివరించారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. అంతేకాక ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను మరో 10 ఏళ్లు పొడిగించి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి బాటలు వేశారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. భారత యువజన సమాఖ్య ప్రతినిధులు సాయిధామ్, అజయ్, బాలాజీ, రాజానాయక్, బాలక్రిష్ణ, మనోజ్, సాయివెంకట్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సిపాయి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా: రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పుట్టిన రోజు వేడుకలను ఆదివారం తిరుపతిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సిపాయి కీర్తిసాగర్‌రెడ్డి, డాక్టర్ సిపాయి మౌనరెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కృష్ణకాంత్, శ్రీగౌరీ, చందన్‌కుమార్, రాజేష్ నాయుడు, షాలిని, మొగిలేశ్వరి, లీలావతి, బాబు, హాస్పిటల్ మేనేజర్ లక్ష్మీకాంత్, రోజా, గీతాంజలి, బాషా, గౌసియా, నూర్జహాన్, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.